*This is about*

*Sri Maatha Kamalambika in Andhra Yogulu book vol.4*

*as*

# ***'Eluru Behara Kamalamma garu'***



# 37. ఏలూరు బెహారా కమలమ్మగారు (1904-1977)

తెలుగువారిలో మొదటి మహామహోపాధ్యాయులు, వీరగ్రాంధికవాది తనుమధ్యాబిల్వేశ్వరస్వామిభక్తులు, తనుమధ్యాపరాశక్త్యుపాసకులు అక్షరసాంఖ్యాచార్యులు, ఆంధ్రభాషాసంజీవనీపత్రికాసంపాదకులు, బహుగ్రంథకర్తలు విశ్వామిత్రగోత్రం నియోగులు కొక్కొండ వెంకటరత్నం పంతులుగారు (1842-1915) ఆంధ్రసాహిత్య చరిత్రలో విశిష్టస్థానం అలంకరించిన పండితకవులు. వారు మద్రాసులో పరవస్తు చిన్నయసూరి, కరాలపాటి రంగయ్య, చదలువాడ సీతారామశాస్త్రి గారల తరువాత ప్రెసిడెన్సీ కళాశాలలోను, కందుకూరి వీరేశలింగంపంతులుగారి తరువాత రాజమహేంద్రవరం ప్రభుత్వకళాశాలలోను ఆంధ్రశాఖాధ్యక్షులుగా ఉద్యోగం చేసినారు. వీరి ప్రథమ కళత్రం రమాంబసంతానం 1. కుమారనరసింహం (తరువాతకాలాన వీరే మాదర బాకం శాంతానందస్వామిగా ప్రసిద్ధులు) 2. లక్ష్మీనరసింహం, 3. వెంకట నరసమ్మ, 4. లక్ష్మీనరసమ్మలు. పంతులుగారి ద్వితీయకళత్రం లక్ష్మమ్మ సంతానం 1. కల్యాణనరసింహం, 2. గాంగేయనరసింహం, 3. లక్ష్మీనరసమ్మ, 4. వెంకట సిరినరసమ్మ, 5. కుమార నరసమ్మ (మరొకపేరు రాజేశ్వరి) 6. తనుమధ్యాంబ,

7.దుర్గాంబ. ఇందులో నాల్గవ సంతానమైన వెంకటసిరినరసమ్మగారే మన కథా నాయకురాలు బెహారా కమలమ్మగారు. వెంకటరత్నం పంతులుగారు రాజమహేంద్రవరంలో ఉద్యోగం చేస్తుండిన కాలంలో శా.శ.౧౮౨౫ శోభకృత్ సంవత్సరం పుష్యబహుళఏకాదశి బుధవారం 13-1-1904 నాడు ఆమె జన్మించినది. ఆమెకు తల్లిదండ్రులు పెట్టిన మొదటిపేరు వెంకటసిరినరసమ్మ. కాని ఆమె ఐదవయేట వెంకటరత్నంగారు ఆమెకు కమలమ్మఅని క్రొత్తపేరు పెట్టినారు. దానికి కారణం ఒక విచిత్రదైవ సంఘటన.

వెంకటరత్నం పంతులుగారు దేవీఉపాసకులు వారి పూజాగృహంలో ఎవరూ ప్రవేశించరు. వారు అందులోనే పూజ చేసుకుంటారు, వ్రాసుకుంటారు, విశ్రాంతి తీసుకుంటారు. బయటికి పోతే తాళం వేసుకొని పోతారు. ఒకనాడు వారు భోజనంచేసి తాళంవేసుకొని బయటికి పోయినారు. 12 గంటలకు లక్ష్మమ్మకు పిల్లలతో కలిసి భోజనం చేయటం అలవాటు. ఆనాడు 12 గంటలకు పిల్లలందరినీ పిలిచింది. వెంకటసిరినరసమ్మ తప్ప మిగతావారందరూ వచ్చినారు. వెంకటసిరినరసమ్మకోసం ఇల్లు, పొరుగిండ్లు, బావులు వెదకినారు. అంతటా విషాదం అలముకున్నది. ఇంతలో పంతులుగారు వచ్చినారు. వారికి విషయం అర్థమైనది. వారు 'జై తనుమధ్యాంబా' అంటూ పూజాగృహం బీగం తెరచి లోన ప్రవేశించినారు. వెంకటసిరినరసమ్మ పంతులు గారు కూర్చుండే ఆసనంపైన అర్ధనిమీలిత నేత్రాలతో పద్మాసనంలో నిశ్చలధ్యానంలో ఉన్నది. పంతులు ఆమె శరీరంపై చేయుంచి ఒడలంతా నిమిరినారు. ఆమె కనులు తెరచింది. ఇందులోనికి ఎప్పుడు వచ్చినావు ఎట్లా వచ్చినావంటే నాకు తెలియదన్నది. రెండవసారి మరల ప్రశ్నిస్తే మామూలు స్పృహలోనికి వచ్చిన వెంకటసిరినరసమ్మ "అమ్మ నన్ను రమ్మని పిలిచింది. అందుకే ఈ గదిలోనికి వచ్చినాను. అమ్మను చూస్తూ ఒడలు మరచిపోయినాను." అన్నది. ఐతే అమ్మా నీ కుడిపాదం చూపుమన్నారు పంతులుగారు. ఆమె కుడిపాదంలోని దివ్యచిహ్నాలు గమనించి పంతులుగారు కనులు మూసుకొని "ఈమె కుడి అరికాలులో చక్రమున్నది. ఈమె నా ఆరాధ్యదేవత పరాశక్తికి

ప్రతిరూపం కమలమ్మ పేరుతో ప్రసిద్ధిపొందుతుంది. నా తరువాత నా పూజాపీఠానికి ఈమే వారసురా"లని ప్రకటించినారు. ఆనాటినుండి వెంకటసిరినరసమ్మ కమలమ్మగా మారినది. ఆమె ప్రవర్తనం కూడ మారిపోయినది. ఇంట్లోనివారు ఇరుగుపొరుగువారు కమలమ్మను మహాత్మురాలుగా గుర్తించి గౌరవించసాగినారు. ఆమె దివ్యబాలికగా గుర్తింపు పొందటం మూలంగా బాలశిక్ష సగం చదువటంతో ఆమె లౌకికవిద్య ముగిసింది. కమలమ్మకు సంగీతం ఇష్టం. ఆమె అమ్మవారి పాటలు పాడుతూ తోడి బాలికలతో పాడించేది. ఆమెకు 8ఏండ్ల వయస్సు రాగానే తూర్పుగోదావరిజిల్లా అంబాజీపేటలో ఉండే శాండిల్యగోత్రులు బెహరా శేషమ్మ సుబ్బారాయుడు దంపతుల 4వ కొడుకు 11ఏండ్ల సత్యనారాయణతో వివాహం జరిగింది. కమలమ్మ మంగళసూత్రాలతో గజ్జెలు మట్టెలతో బాలగౌరీదేవిలా పుట్టినింట మెట్టినింట తిరుగుతుండేది.

కమలమ్మ ఈడేరి కాపురానికి పోయేనాటికి వెంకటరత్నం పంతులుగారు పరమపదించినారు. కమలమ్మ తండ్రిగారికి వారసురాలై పరాశక్తిని కొలుస్తుండేది. బుద్ధిమంతుడైనా సత్యనారాయణకు ఆమెతో భావసామ్యం కుదురలేదు. వారి దాంపత్య జీవితంపై మాయతెరలు కమ్ముకున్నవి. సత్యనారాయణ అన్నగారు బెహరా తిమ్మరాజు మద్రాసులో రైల్వే ఉద్యోగి. తమ్ముని సంసారం సరిగా లేదని తెలిసి ఆయన తిరువత్తియూర్ శతాధికవృద్ధులు బాలాజీశ్యామలరావు సోదరయోగులను ఆశ్రయించినారు. ఆ యోగిపుంగవులు కమలమ్మ సత్యనారాయణ దంపతులకు 40 దినాలదీక్ష యిచ్చినారు. సత్యనారాయణకు శివపంచాక్షరిని కాళీమంత్రాన్ని ఉపదేశించినారు. గురుకృపతో కమలమ్మలోని ఉగ్రమూర్తి సౌమ్యమూర్తియైనది. సత్యనారాయణలో శివశక్తుల తేజస్సు ప్రవృద్ధమైనది. దంపతులిరువురిలో భావ సారూప్యత యేర్పడింది. అప్పటినుండి దంపతులు బాలాత్రిపురసుందరిని అర్చిస్తూ సుఖజీవనం ప్రారంభించినారు. సత్యనారాయణగారు బొంబాయి నగరంలో ఒక ప్రైవేటు ఉద్యోగంలో చేరినందున దంపతులక్కడే కాపురం పెట్టినారు. కమలమ్మగారి సాధన నిరంతరం సాగింది. ఆమెకు మహారాష్ట్ర భాష వచ్చింది. కష్టాలలో ఉన్నవారికి

తోడ్పడుతూ తమ తపశ్శక్తిద్వారా వారికి మేలు చేసేది. ఆమెకు భక్తుల సంఖ్య పెరిగింది. శుక్రవారం ఉపవాసం, ఖడ్గమాల, అష్టోత్తరశతనామపూజ, లలితాసహస్రనామ పారాయణం, కుంకుమపూజలు పానకం నైవేద్యం భక్తులకు బోధించి ఆచరింప చేసేది. కొంతకాలం తరువాత సత్యనారాయణగారికి తూర్పుగోదావరిజిల్లాబోర్డులో ఉపాధ్యాయవృత్తి లభించింది. ఆయన రాజోలు, ముత్యాలపల్లి, సంబలదీవి, గూటాల, తాళ్ళపూడి, అన్నదేవరపేట, కొవ్వూరు, గొల్లగూడెం గ్రామాల్లో పనిచేసినా కాపురం మాత్రం కొన్ని సంవత్సరాలు అన్నదేవరపేటలో, మరికొన్ని సంవత్సరాలు కొవ్వూరులో పెట్టినారు. ఆ దంపతుల ప్రథమసంతానం రేవతి 1935లో పుట్టినది. 1938 ద్వితీయ సంతానం బాలాత్రిపురసుందరి పుట్టినది. 1940 సం॥ తృతీయపుత్రిక లక్ష్మీసరోజిని పుట్టినది. రెండవ కూతురు బాలాత్రిపురసుందరినే త్రిపురాంబ అనేవారు. ఆమెయే తల్లికి ఆధ్యాత్మికవారసురాలు.

సత్యనారాయణగారికి గొల్లగూడెం బదిలీ జరిగితే సమీపగ్రామం భీమడోలులో కాపురం పెట్టినారు. అక్కడ కమలమ్మ జీవితం కొత్తమలుపు తిరిగింది. వారు దేవులపల్లి లక్ష్మీనారాయణగారింట్లో అద్దెకుండేవారు. లక్ష్మీనారాయణ బాలాత్రిపురసుందరీ ఉపాసకులు. ఆయన భార్య రాజేశ్వరి కమలమ్మగారి సాధనకుపకరించేది. కమలమ్మ గారు ప్రతిదినం మామూలుపూజ, శుక్రవారం ఉదయం, సాయంకాలం విశేషపూజ చేసేవారు. సాయంకాలం పూజప్పుడు త్రిపురాంబ మీదకు అప్పుడప్పుడు అమ్మవారు వచ్చేది. కమలమ్మ హారతి వెలిగించి, పానకం ఆరగింపు చేస్తే అమ్మవారు శాంతించేది. ఒకనాడు అమ్మవారు కమలమ్మ కలలో కనిపించి త్రిపురాంబకు అముకదినంనాడు గండమున్నదని హెచ్చరించింది. ఆమె భర్తతో చెప్పలేదు. ఆదినం రానేవచ్చింది. ఆనాడు మధ్యాహ్నం త్రిపురాంబ క్రిందపడి కొట్టుకుంటూ మేకవలె అరవసాగింది. కమలమ్మ గురువులను ధ్యానించి బాలాత్రిపురసుందరీధ్యానంలో మునిగింది. త్రిపురాంబ తేరుకున్నది. కమలమ్మగారికి 40ఏండ్లు ఆమె తపస్సు పండేదినాలు సమీపించినవి. ఒక శుక్రవారం సాయంకాలం సత్యనారాయణగారు గొల్లగూడెం

నుండి వచ్చి కాళ్ళు కడుక్కొని పూజామందిరంలోనికి రాగానే ఆయనపైకి ఉగ్రరూపిణీ కాళిక వచ్చింది. కమలమ్మ నీకేం కావాలి తల్లీ అంటే మేక కోడి మాంసం కావాలన్నది. కమలమ్మ అవి మా యింట ఉండవు. నీవు సౌమ్యరూపంలో మాయింట బాలాత్రిపుర సుందరిగా ఉండాలెననేకదా మా గురువులు బాలాజీశ్యామలరావులు అర్థించినారు అని ప్రార్థించింది. సత్యనారాయణ  పెసరపప్పు పులగం, పానకం కోరినారు.కమలమ్మ వెంటనే చేసిపెడితే తిన్నారు. సత్యనారాయణగారి నోట ఇక నేను వెళ్ళిపోతున్నాను. మీ యింట బాలాత్రిపురసుందరిగానే  నీకు తోడుగా ఉంటాను. నీ భక్తికి మెచ్చినాను అనే మాటలు వెలువడినవి. కమలమ్మ "అమ్మా నేను నిన్ను భరించగలనా! అంటే "నీవు అర్పించే తులసీదళమే నాకు చాలు. నేటినుండి 3 సంవత్సరాలు నీకు తోడుగా ఉండి అటుతరువాత నీలో ఐక్యమౌతాను. అప్పటినుండి నువ్వే నేనుగా పూజింప బడతావు. నీకు భవిష్యత్ దర్శనం వాక్శుద్ధి ఇస్తున్నా"నంటూ అంతర్ధానం చెందింది.

అప్పటినుండి కమలమ్మ జీవితంలో నూతనాధ్యాయం ప్రారంభమైనది. ఆమెకు అందరి భవిష్యత్తులు తెలిసేవి. ఆమె కుంకుమపెట్టి తీర్థమిస్తే వ్యాధులు తగ్గిపోయేవి. గొల్లగూడెంలో కలరా ప్రబలింది. సత్యనారాయణగారికి కలరా సోకి ప్రమాదపరిస్థితిలో ఇంటికి చేరినారు. కమలమ్మ అమ్మవారి తీర్థప్రసాదాలతో స్వాస్థ్యం సమకూడినది. ఒకసారి దంపతులు పట్టిసం సేవించి బండిలో తిరిగి వస్తుండగా కమలమ్మ ఏడుస్తున్నది. సత్యనారాయణగారు కారణమడిగితే రేపు శుక్రవారం మహాశివరాత్రి మాచెల్లెలు తనుమధ్యాంబ మరణించే దృశ్యం గోచరిస్తున్నదిఅన్నది. అన్నట్లే శుక్రవారం సాయంకాలానికి దుర్వార్త వచ్చింది. కమలమ్మగారి మాహాత్మ్యం జనులు కథలుగా చెప్పుకుంటున్నారు. కొందరు నమ్మనివారు అవహేళన చేస్తున్నారు. పొరుగింట అద్దెకున్న వరదరాజులు కమలమ్మను అపహాస్యం చేసి అవమానకరంగా మాట్లాడినాడు. ఒకనాటి అర్ధమరేయి అతనికి దుర్భరమైన కడుపునొప్పి వచ్చినది. ఏ మందులూ పనిచేయలేదు. ఇది కమలమ్మగారిని నిందించిన ఫలమని అతనిభార్య సూర్యావతమ్మ కమలమ్మ ఇంటికి పోయి క్షమాభిక్ష వేడింది. కమలమ్మ కుంకుమ ఇచ్చి నీళ్ళలో

కలిపి త్రాగించుమన్నది. అట్లా చేస్తే ఆతని ఉదరశూల వెంటనే తగ్గింది. వరదరాజులుకు బుద్ధివచ్చింది. ఆనాటి నుండి దంపతులు కమలమ్మగారి భక్తులైనారు.

1952 సంవత్సరం సత్యనారాయణగారికి కలవర్రుకు బదిలీ జరిగింది. సత్యనారాయణగారు ఆడపిల్లల చదువులు ఇతరసౌకర్యాలు దృష్టిలో పెట్టుకొని తమ కాపురం సమీప పట్టణం ఏలూరుకు మార్చినారు. ఏలూరు అగ్రహారంపేటలో యడవల్లి వారింట్లో అద్దెకుండేవారు. కమలమ్మ మహిమలు అప్పటికే ఏలూరులో వ్యాపించినవి. ఆమె పూజామందిరంలో ఒక పీటపై బాలాత్రిపురసుందరిపటం ప్రక్కనే గురువులు బాలాజీపటం పెట్టి పూజిస్తుండేది. వ్యాధులనివారణకోసం, ఉద్యోగ లబ్ధికోసం, సంతాన ప్రాప్తికోసం, వ్యాపారలాభంకోసం ఇట్లా తీరుతీరు కోరికలతో జనులు కమలమ్మను దర్శించి తీర్థకుంకుమలందుకొని తమ అభీష్టాలను నెరవేర్చుకునేవారు. కమలమ్మకు స్త్రీలు పురుషులు ఎందరో భక్తులైనారు. ఆమె కొందరిని తమతమ యిండ్లలో శుక్రవారం పూజలు చేసుకొమ్మనేది. కొందరిని తమ యింట జరిగే పూజలకు రమ్మనేది. కొందరట్లా చేసినా తమ అభీష్టాలు తీరకపోతే "మీరావిధంగానే పూజలు చేయండి మిగతా నేను చూచుకుంటాను" అని తమ తపస్సు ధారపోసి భక్తుల సమస్యలు తీర్చేది. అందరూ ఆమెను పూజా పిన్నిగారనే వారు. 1957 సంవత్సరం అమ్మవారు కమలమ్మ కలలో సాక్షాత్కరించి, "సుదీర్ఘయాత్ర ముగింపుకు వచ్చింది. నేను ఇక స్థిరపడదలచినాను. అన్నపూర్ణాసమేత శ్రీప్రతాపవిశ్వేశ్వర ఆలయప్రాంగణంలో సత్రపు గదులున్నవి. నేటినుండి నీ నివాసం నానివాసం అక్కడే. నేను నా యథాస్థానం చేరుకుంటున్నాను నీకు నా సామీప్యం ప్రసాదిస్తున్నాను. నా అనుగ్రహం నీకు సదా ఉంటుంది. భక్తులకు సహాయం చేస్తూ నన్ను సేవిస్తూ తరించు"మని అంతర్ధానమయినది. అమ్మవారి ఆదేశానుసారం కమలమ్మగారు సత్రపుగదుల్లోకి మారినారు. అమ్మవారిపీఠం ఒకగదిలో ఉత్తరముఖంగా శివునికి అభిముఖంగా ప్రతిష్ఠించినారు. ఆనాటినుండి నేటిదాకా అమ్మవారు ఆ సత్రపుగదిలో ప్రతిష్ఠితురాలై భక్తుల అభీష్టాలు తీరుస్తున్నది. అమ్మవారు తనకు నిత్యనైవేద్యాలక్కరలేదని యథాశక్తి అర్చించి తరించవచ్చునని ఆదేశించింది. భక్తులీనాటికీ తమతమ శక్తిననుసరించి అర్చించి తరిస్తున్నారు.

పీఠంలో శుక్రవారాలు కుంకుమార్చనలు జరుగుతున్నవి. ఒకప్పుడు పెద్దలను తరువాత చిన్నపిల్లలను అమ్మ ఆవేశించేది. 1954 సం॥ దసరానాడు కానుకొలను అప్పారావు భార్య కమలమ్మ అమ్మవారికి లక్షకుంకుమార్చన జరిపినది. మరునాడు అన్నసంతర్పణం. ఆనాటినుండి అమ్మవారి శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నవి. ఎవరూ డబ్బులు తీసుకోరు, ఇవ్వరు. భక్తులు తమతమ చేతనైన సేవలు స్వచ్ఛందంగా చేస్తారు. ఏలూరువాసులే కాదు దూరదూరాల భక్తులు వచ్చి ఆ సేవల్లో భాగస్వాము లౌతారు. భక్తులు నివేదించే పండ్లు ప్రసాదాలు ఎప్పటికప్పుడు భక్తులందరికీ పంచి పెడతారు. **"అంతర్ముఖ సమారాధ్యా బహిర్ముఖ సుదుర్లభా"** అనే అమ్మవారి తత్త్వానికి కమలమ్మగారు సరయిన ఉదాహరణ. ఎవరో ఒక సాధువు కమలమ్మగారితో ఇక్కడ శ్రీచక్రం ప్రతిష్ఠాపన చేసినారా అంటే కమలమ్మగారు వక్రములేని మనసే శ్రీచక్రము. అది అమ్మవారి పాదాలచెంత ప్రతిష్ఠింపబడింది అని సమాధానం చెప్పినారు. అమ్మవారి విగ్రహం దగ్గర శివపంచాక్షరి లిఖించిన ఒక యంత్రం తప్ప ప్రత్యేకంగా శ్రీచక్రం లేదు. శుక్రవారాలేకాక మంగళవారాలు కూడా భక్తులు విశేషపూజలు చేసుకుంటారు.

కమలమ్మగారి అనుగ్రహానికి పాత్రులైన భక్తులెందరో ఉన్నారు. వారు వచ్చి తమ కష్టాలు సమస్యలు చెప్పితే కమలమ్మగారు అమ్మవారి పీఠానికెదురుగా కూర్చుండి అమ్మవారి ముఖంలోకి చూస్తూ సమాధానాలు పరిష్కారాలు చెప్పేది. అమ్మ కమలమ్మ గారితో కనులతో మాట్లాడేది. ఏలూరు అగ్రహారంలో శ్రీరామమూర్తి భవాని దంపతు లుండేవారు. శ్రీరామమూర్తి Water works deptలో ఇంజనీరు. భవాని కమలమ్మ భక్తురాలు.ఒకనాడు భవాని కలలో కమలమ్మగారు కనపడి నీ మంగళసూత్రాలు తెగిపోతున్నవి చూచుకో అన్నది. భవానికి మెలుకువైనది. కొద్ది ఆధారంతో మంగళ సూత్రాలున్నవి. భర్తను లేపి చెప్పితే ఆయన పట్టించుకోలేదు. ఆమె మరునాడుదయమే వచ్చి కమలమ్మగారికి తన స్వప్నవృత్తాంతం చెప్పినది. కమలమ్మ నీకేం భయంలేదు. నేను చూచుకుంటానన్నది. రెండుదినాల తరువాత శ్రీరామమూర్తి ఆఫీసు పనిమీద మరికొందరితో విజయవాడకు పోయి పని ముగించుకొని కొండపైన కనకదుర్గ

దర్శనానికి పోయినాడు. కాళ్లు కడుక్కోవటానికి కొలనులో దిగి శ్రీరామమూర్తి మూడుమెట్లు దిగి కాలువలో పడిపోయినాడు. ఆయనకు ఈత రాదు. మునిగిపోతుంటే ఎవరో ఎఱ్ఱని చీరకట్టుకున్న స్త్రీమూర్తి అతణ్ణి లేవనెత్తి తెచ్చి కొలను గట్టుమీద పడుకోబెట్టింది. శ్రీరామమూర్తి తేరుకొని కండ్లు తెరచి చూస్తే సాక్షాత్తు కమలమ్మగారే. ఆమె ఇతరులకు కనపడలేదు. ఆ రాత్రి ఇల్లు చేరిన శ్రీరామమూర్తి భార్యకు జరిగినదంతా చెప్పినాడు. మరునాడుదయమే దంపతులు వచ్చి కమలమ్మపాదాలపై పడ్డారు. తనకు ప్రాణభిక్ష పెట్టినందుకు కమలమ్మగారికి శ్రీరామమూర్తి కృతజ్ఞతగా ఏదైనా చెప్పితే చేస్తాననన్నాడు. కమలమ్మ అమ్మవారే చెప్తుతుంది అన్నది. ఆ రాత్రి శ్రీ రామమూర్తి స్వప్నంలో కమలమ్మగారు కనపడి నిన్ను కాలువలో మూడుమెట్లు ఎక్కించి రక్షించినాను. మూడుమెట్లు గల పూజామందిరం చేయించి సమర్పించుమన్నది. ఆ దంపతులు మూడుమెట్లుగల పూజామందిరం చేయించి సమర్పించుకున్నారు.

2. దేవగుప్తాపు మల్లపరాజు అమ్మ భక్తుడు. భార్య గర్భవతి. డాక్టర్లకు చూపిస్తే అన్నిపరీక్షలు చేసి కడుపుకాదు కడుపులో బల్ల పెరుగుతుంది ఆపరేషన్ చేయవలె నన్నారు. కమలమ్మను ఆశ్రయిస్తే 'డాక్టర్లకేమి తెలుసు 18 నెలలకు ఆడపిల్ల పుడుతుంది. బాలాత్రిపురసుందరి అని పేరుపెట్టుకొం'డన్నారు. అన్నట్లే ఆమె 18 మాసాల తరువాత ఆడశిశువును కన్నది. ఆ భక్తులు వెండితో అమ్మవారి విగ్రహం చేయించి పీఠానికి సమర్పించినారు. ఆ విగ్రహం సిద్ధంచేసిన అగసాలె భక్తుడు త్రిపురసుందరీ ఉపాసకుడు. అతనికి స్వప్నంలో కనపడి విగ్రహం చేసే విధానం కమలమ్మగారు చెప్పినారు.

3. కమలమ్మగారి బొంబాయి భక్తుని భార్యకు క్యాన్సరు వ్యాధి ముదిరింది. డాక్టర్లు అపరేషన్ చేసినా లాభంలేదన్నారు. కమలమ్మగారు కలలో కనిపించి ఏలూరు పీఠానికి వచ్చి తీర్థప్రసాదాలు తీసుకుంటే నయమవుతుందని చెప్పినారు. ఆ దంపతులు వచ్చి అమ్మవారి సన్నిధిలో కొన్నిదినాలుండి అమ్మవారి నర్చించినారు. కమలమ్మగారు

వారికి ప్రతిదినం తీర్థప్రసాదాలిచ్చి దీవించినది. కొన్నివారాలు పూజాకుంకుమ పోస్టులో పంపినది. ఆమె క్యాన్సర్ పోయింది. ఆ దంపతులు జీవితాంతం కమలమ్మగారిని బాలాత్రిపురసుందరిగా భావించి పూజించినారు.

4. హరి స్వరాజ్యమ్మ సంతానార్థియై కమలమ్మగారిని సేవించినది. కమలమ్మ గారు ఆమె కలలో కనపడి నీకు కొడుకు పుడతాడు మా గురువులు బాలాజీశ్యామల్‌రావు పేరు పెట్టుకొమ్మన్నది. అమ్మ చెప్పినట్లే ఆమె కొడుకును కన్నది. బాలాజీ శ్యామరావని పేరు పెట్టుకున్నారు. ఒకసారి ఆమె భర్తకు ఒడలంతా తీవ్రంగా కాలింది. గాయాలు ఎం॰ చికిత్సచేసినా తగ్గలేదు. డాక్టర్లు స్కిన్‌గ్రాఫ్టింగ్ చేయవలెనన్నారు. కమలమ్మగారిని ప్రార్థిస్తే ఏమీఅక్కరలేదు క్రమంగా నయమవుతుందని తీర్థమిచ్చినారు. అన్నట్లే జరిగింది.

5. మాధవపెద్ది వరలక్ష్మి అనే భక్తురాలింటికి కమలమ్మగారు తామై పోయి నీకు త్వరలో ఒక గండం రానున్నది. ప్రతిదినం అమ్మవారిని పూజించుకో రక్షిస్తుందని హెచ్చరించి వచ్చింది. వరలక్ష్మి కొన్నిదినాల తరువాత కాలువలో బట్టలుతుకుతూ తూలిపడిపోయి తలకు రాయితగిలి రక్తంకారగా స్పృహకోల్పోయినది. ఎవరో వచ్చి ఆమెను బయటికి తీసి ఆసుపత్రిలో చేర్పించినారు. ఆమె గండం గడిచింది. అమ్మ అడుగకుండానేపోయి తమభక్తులను రక్షిస్తుందనటానికి ఈ సంఘటన ఉదాహరణ.

6. కమలమ్మగారు హైమవతి అనే భక్తురాలి భర్తను లారీప్రమాదంనుంచి రక్షించినది. మరొక యువతికి అమ్మవారు చెప్పినట్లే విదేశీయానం చేసిన భర్త లభించినాడు. ఇందిరాదేవిని ముందుగా హెచ్చరించటం వలన వెనుక గదిలో విలువైన వస్తువులు పెట్టుకోకుండా జాగ్రత్త పడినందున దొంగలు పడినా విలువైన వస్తువులు పోలేదు. చేబియ్యం అన్నపూర్ణమ్మ అనే భక్తురాలి భర్త నాస్తికుడు అమ్మచేతి తీర్థం త్రాగి ఆస్తికుడైనాడు. ఇట్లా కమలమ్మగారు తమ భక్తులేగాక అయాచితంగా కూడా ఎందరికో మేలు చేసినారు. కప్పగంతుల సుబ్రహ్మణ్యశర్మ, రామారావు, కాశీ విశ్వేశ్వరశర్మ, వేణుగోపాలరావు సోదరులు అమ్మ మానసపుత్రులు. వారు అనన్య భక్తులైనారమ్మకు.

కమలమ్మగారికి ఒకనాటి రేయి తాను స్వర్గస్థురాలైనట్లు తనకు కప్పగంతుల సోదరులే అంత్యక్రియలు చేస్తున్నట్లు కనపడింది. సుబ్రహ్మణ్యశర్మ గాయత్రీ దంపతులకు సంతానం కలిగినా చనిపోతుండేవారు. సుబ్రహ్మణ్యశర్మకు కారుప్రమాదం జరిగింది. అమ్మగారి అనుగ్రహంతో బ్రతికినాడు. అమ్మ గారిని సంతానంకోసం మరల మరల ప్రార్థిస్తే జీవితాంతం మంగళవారం ఉపవాసదీక్ష ఇచ్చి పుత్రవతీభవ అని దీవించింది. బిడ్డ పుడుతుంది, నా పేరు పెట్టుకోమన్నది. గాయత్రికి బిడ్డ పుట్టింది కమలమ్మ అని నామకరణం చేసినారు. సుబ్రహ్మణ్యశర్మ కృతజ్ఞతలతో అమ్మా ! నీ ఋణం ఎట్లా తీర్చుకునేది అని ప్రార్థిస్తే కమలమ్మగారు తమకు అంత్యక్రియలు చేయవలెనని ప్రతిసంవత్సరం ఆబ్దికం పెట్టవలెనని కోరింది. తరుహాతి కాలాన ఆ కప్పగంతుల సోదరులు కమలమ్మ సత్యనారాయణ దంపతులకు అంత్యక్రియలు చేయటమే కాక నేటికీ ఆబ్దికాలు పెడుతున్నారు. ఒకసారి గాయత్రి తన బిడ్డ కమలమ్మను అల్లరి చేస్తే కొట్టింది. అప్పుడు కమలమ్మగారు కలకత్తాలో ఒక భక్తుని ఇంటిలో ఉండినారు. రెండు దినాల తరువాత గాయత్రికి కలకత్తానుండి జాబు వచ్చింది. ఆ జాబులో "నీవు కొట్టిన దెబ్బకు నా వీపుపై ఐదువేళ్ళ ముద్రలు పడ్డాయి. అట్లా అయితే నేను నీ దగ్గర ఉండను వెళ్ళిపోతాను" అని ఉన్నది. ఏలూరులో గాయత్రి తన బిడ్డను కొట్టిన దెబ్బ కలకత్తాలో ఉన్న కమలమ్మగారికి తగిలిందన్నమాట. కప్పగంతుల సోదరులలో రెండవవారైన రామారావు అవ్వయ్యార్ భక్తుడు. ఆయన కమలమ్మగారిలో అవ్వయ్యార్‌ని దర్శించేవాడు. ఆయన భార్య వెంకటలక్ష్మికి కమలమ్మగారు సోమవారం ఉపవాసదీక్ష ఇచ్చి ఆ కుటుంబాన్ని అనుగ్రహించినారు. మూడవ సోదరుడు విశ్వేశ్వర శర్మ కమలమ్మగారిని మాతృమూర్తిగా ఆరాధించేవాడు. "కమలమ్మగారి సంక్షిప్త చరిత్ర" రచించే భాగ్యం ఆయనకు లభించింది. నాలుగవ సోదరుడు వేణుగోపాల్‌కు నోటిలో పుండ్లయితే అమ్మగారే తగ్గించినారు.

ఒకసారి కమలమ్మగారు తిరువత్తియూరు బాలాత్రిపురసుందరీ దర్శనానికి పోగా అక్కడ ఈమెకోసం ఎదురుచూస్తున్న అపరిచితదంపతులు కాళ్ళపై వ్రాలినారు.

ఎవరు మీరంటే మేం అమ్మవారి భక్తులం. సంతానం కోసం అమ్మను ప్రార్థిస్తే అముక దినంనాడు ముఖంపై పెద్దబొట్టు రెండు పులిపిరికాయలతో ఒక పెద్ద ముత్తైదువ వస్తుంది ఆమెకు నమస్కరించి బొట్టు పెట్టించుకోండి సంతానం కలుగుతుందని కలలో చెప్పింది. మీకోసం ప్రొద్దుటినుండి ఎదురుచూస్తున్నాము మమ్ము ఆశీర్వదించం డని మరల పాదాభివందనం చేసినారు. కమలమ్మగారు వారికి బొట్టుపెట్టి ఆశీర్వదించింది. వారికి ఆడపిల్ల పుట్టింది. మరొకసారి కమలమ్మగారు కన్యాకుమారి యాత్రకు పోయి సముద్రస్నానం చేసి తోడి భక్తులతో ఇసుక తిప్పలపై కూర్చుండగా పెరుగమ్మేవాడు వచ్చినాడు. కమలమ్మ పెరుగు కొని అందులో అరటి పండ్లు పంచదార కలిపి అందరికీ పంచుతుండగా తమిళదంపతులు వచ్చి పాదనమస్కారం చేసి ప్రసాదమడిగినారు. మీరెవరంటే మేము సంతానరహితులం. కన్యాకుమారిని ప్రార్థిస్తే ఎఱ్ఱచీర ధరించి ముఖాన పులిపిరికాయలున్న పెద్ద ముత్తయిదువ వస్తుంది. ఆమెకు నమస్కరించి ప్రసాదం తీసుకోండి సంతానం కలుగుతుందని అమ్మవారు కలలో చెప్పింది. అందుకోసం మేమిక్కడ కాచుకొని ఉన్నాము మమ్ముల ఆశీర్వదించండి అన్నారు. కమలమ్మగారు ఆ తమిళదంపతులకు ప్రసాదమిచ్చి ఆశీర్వదించినారు. ఆ దృశ్యం చూచిన కొందరు యాత్రికులు కమలమ్మ గారి వైపు అదోవిధంగా చూస్తుంటే ఏం చూస్తున్నారు? నేను కట్టుకున్న చీరయే గుళ్ళో అమ్మవారు కట్టుకున్నది చూచిరండన్నది. వారు పరీక్షకై అమ్మవారి గుడిలోనికి పోయి చూస్తే కమలమ్మగారు కట్టుకొన్న చీర గుడిలో అమ్మవారికి కట్టించిన చీర ఒకేతీరుగా ఉన్నవి. సంతానార్థుల ప్రారబ్ధం బలీయమైతే అమ్మ, వారితో తీర్థయాత్రలు పూజలు చేయించి ఆశీర్వదించేది. వారికి సంతానం కలిగేది.

కమలమ్మగారిది విశిష్టమైన వ్యక్తిత్వం. చిన్ననాటినుండి భగవద్భక్తి పెద్దల యెడ గౌరవం, చిన్నల యెడ వాత్సల్యం ఆమె సహజగుణాలు. ఆమె పెద్దలలో పెద్ద, చిన్నలలో చిన్న. పదిమంది పిల్లలను పోగు చేసుకొని పాటలు పాడేది, ఆటలు ఆడేది. ఆమె బాలాత్రిపురసుందరీ భక్తురాలైనా ఒక భక్తురాలికి రాఘవేంద్ర స్వామి

దీక్ష ఇచ్చింది. ఆమె ఏలూరులోని నాగూరుబాబా వలీబాబా ఉర్సులో పాల్గొనేది. జొన్నవాడ తిరుపతి క్షేత్రాలు దర్శించేది. ఆమె ఆధునికకాలానికి తగినట్లుగా తన బిడ్డలందరికీ బాగా చదువు చెప్పించినది. ఆమెవలెనే ఆమె పూజావిధానం నిరాడంబరంగా ఉండేది. ఒకసారి త్రిమూర్తులు వృద్ధబ్రాహ్మణ వేషంలో వచ్చి ఆమె ఆతిథ్యం పొంది "ఈ పీఠం అనేకకుటుంబాలకు సన్మార్గం చూపిస్తుంది" అని ఆశీర్వదించి పోయినారు. ఒకసారి ఆమె బస్‌స్టాండులో బస్సుకోసం చూస్తుంటే అపరిచితుడు వచ్చి నీ మెడలోగొలుసు చాలా బాగుంది, నా భార్య చూస్తుందట అని అల్లంత దూరానగల తన భార్యను చూపితే ఆమె గొలుసు ఇచ్చింది. వాడు గొలుసు తీసుకపోయి తిరిగిరాలేదు. తెలిసినవారు పోలీసులకు రిపోర్టు ఇస్తే దొంగను పట్టుకొని చితుకబాదినారు. కమలమ్మగారు పోలీసు స్టేషన్‌కు పోయి వాణ్ణి విడిపించినది. ఒక బంధువు కూతురుకు పెండ్లిలో బంగారు గాజులు అనుకున్న ప్రకారం పెట్టనందున అల్లుడు పిల్లను పుట్టింటికి తరిమినాడు. ఆ తల్లివచ్చి తన గోడు చెప్పితే కమలమ్మగారు తన చేతిగాజులు తీసి యిచ్చింది. అంతటి కరుణామూర్తి కమలమ్మగారు.

కమలమ్మ సత్యనారాయణ దంపతుల వానప్రస్థంకూడా చాలా విశిష్టమైనది. వారు ఒకరికొకరు నమస్కరించుకునేవారు. చివరిదినాలలో సత్యనారాయణగారు రాజమహేంద్రవరంలో అన్నగారి పిల్లలఇంట్లో ఉంటూ మార్కండేయస్వామి దేవాలయంలో తపస్సు చేసుకునేవారు. మధ్య మధ్యన ఏలూరు వచ్చి భార్యా పిల్లలను చూచిపోయేవారు. సత్యనారాయణగారు 1972 సంవత్సరం పరమపదించినారు. కమలమ్మగారు తనకు ఇంకా ఐదు సంవత్సరాలు ఆయువని ముందుగానే చెప్పినారు. 1977 సం॥ శరన్నవరాత్రులు ఆరోగ్యం బాగాలేకున్నా వైభవంగా జరిపించినారు. ఎక్కువకాలం ధ్యానంలోనే ఉండేవారు. 13-12-1977నాడు ఒక భక్తురాలింట భోజనం చేసివచ్చి రామారావును పంపి తాడెపల్లిగూడెంలో ఉంటున్న కూతురు సరోజనిని పిలిపించుకున్నారు. రాత్రి పదిగంటలకు అమ్మగారికి ఆయాసం వచ్చింది. ఆదినారాయణమూర్తి అనే భక్తుని పిలిపించుకున్నది. "సమయం ఆసన్నమైనది పై

నుండి పిలుపు వచ్చింది" అంటూ పద్మాసనస్థయై బ్రహ్మరంధ్రం భేదించుకొని ప్రాణం విడిచింది. అది శా.శ ౧౮౯౯ పింగళనామసంవత్సరం మార్గశిరశుద్ధచవితి మంగళవారం రాత్రి. మరునాడు కప్పగంతుల సోదరులామెకు అంత్యక్రియలు శాస్త్రోక్తంగా చేసినారు. అమ్మగారు చాలా దినాలముందే తమ శరీరం పోయినా తాము ఆ పీఠంలోనే ఉండి భక్తులను రక్షిస్తుంటామని చేసిన వాగ్దానం నిలుపుకున్నారు. జాలమ్మ అనే భక్తురాలికి కలలో కనపడి పూజాపీఠానికి తీసుకపోయి చూస్తుండగా పీఠంలోని విగ్రహాలలో లీనం కావటం, ఆసుపత్రిలో ప్రసవించిన తమ మనుమరాలు పద్మశ్రీకి కనపడి మనుమణ్ణి ఎత్తి ముద్దాడి "మైలపడ్డాను కాశీకి పోయి గంగాస్నానం చేసి వస్తా"నని తిరోహితురాలు కావటంవంటి సంఘటనలు అమ్మ ఏలూరు పీఠంలో సత్యనివాసం చేస్తున్నదనటానికి నిదర్శనాలు. ఇంకా మహంకాళి ఆదినారాయణ మూర్తి, దేవులపల్లి హేమలత,ఆకెళ్ళ చిట్టెమ్మ, పోతుకూచి పుల్లాబ్జాక్షి, చెరుకూరి సీతాలక్ష్మి, బండారు అన్నపూర్ణ, పోతుకూచి లక్ష్మి నారాయణ ప్రభృతి భక్తులెందరో కమలమ్మగారు సదా తమను నమ్మినవారి యింట వెంట జంట ఉండి యోగక్షేమాలు చూస్తున్నారనటానికి నిదర్శనాలు.

కమలమ్మగారు ఏలూరు ప్రతాప విశ్వేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలోని పెంకుటింట్లో అలనాడు స్థాపించిన త్రిపురసుందరీ పీఠం, ఈనాడు కమలాంబికా ముక్తి ధామంగా ప్రసిద్ధం. అమ్మగారి ముగ్గురు బిడ్డలలో పెద్దకూతురు రేవతిని తమ తమ్ముడు గాంగేయ నరసింహంగారికిచ్చి పెండ్లి చేసినారు. అమ్మగారి రెండవ కూతురు త్రిపురాంబ బ్రహ్మచారిణి, మూడవకూతురు లక్ష్మీసరోజినికి నిడమర్తి నారాయణరావు గారితో పెండ్లి జరిగినది. ఈ దంపతుల సంతానం 1. రత్నబాల, 2. రాజశ్రీ, 3. పద్మశ్రీ, 4. కమలాశంకరదత్తు, 5. దేవీ దత్తులు. రత్నబాలగారే తమ అమ్మమ్మ జీవితం వ్రాసిన ధన్యురాలు. కమలమ్మగారి తరువాత ఆమె రెండవ కూతురు బ్రహ్మచారిణి త్రిపురాంబగారే పీఠం బాధ్యత వహించినారు. థియోసోఫికల్ సొసైటీవారి పాఠశాలలో ఉపాధ్యాయగా ఉంటూ తమ సర్వస్వం ధారపోసి పీఠాన్ని ఇతోధిక

వైభవంతో కాపాడుతున్నారు. పీఠం మొదట పెంకుటింట్లో ఉండేది. ఇప్పుడు త్రిపురాంబ తదితరభక్తుల కృషితో డాబాగా మారినది. త్రిపురాంబగారు తమ సోదరి కూతురు సుంకేసుల రత్నబాలకు ఆధ్యాత్మికసాధనలో మార్గదర్శకురాలై పీఠనిర్వహణ బాధ్యతను అప్పగించినారు. రత్నబాలగారు అమ్మపేరుతో శ్రీశ్రీ రత్నకమలాంబికా సేవాట్రస్ట్ నెలకొల్పి పీఠం కార్యక్రమాలు శ్రద్ధాభక్తులతో చేస్తున్నారు. శరన్నవరాత్రుల్లో వేల భక్తులు పాల్గొంటారు. శుక్రవారాలు వందల భక్తులు కుంకుమార్చనలు చేస్తారు. ప్రతి సంవత్సరం భక్తులు కమలాంబికా ఆరాధనోత్సవాలు చేస్తున్నారు. కమలాంబిక షోడశోపచారపూజలు అనుదినం జరుగుతున్నవి.

ఆధారం :

1. శ్రీ కమలాంబికా దివ్య చరితము-శ్రీమతి సుంకేసుల రత్నబాల, శ్రీబాలా త్రిపురసుందరీ పీఠం బ్రాహ్మణాగ్రహారం, ఏలూరు, ప.గో.జిల్లా-534001.